లేడిపిల్లని రక్షించాడని, తన మరణానంతరం కూడా దేవుడు దాన్ని కాపాడుతాడని, తను దేవుడి చేతిలో కేవలం ఓ పరికరం మాత్రమేనని అనుకోకపోవడమే భరతుడు చేసిన తప్పు. అలా భావిస్తే ప్రాణోత్క్రమణ సమయంలో అతనికి ఆ లేడిపిల్ల బాగోగుల మీద ఎలాంటి ఆలోచనా రాక, దేవుడ్ని స్మరించి వుండేవాడు. మనమంతా కూడా చేసే పొరబాటు ఇదే. మనం చేసే ప్రతీదీ మనమే స్వతంత్రంగా చేస్తున్నాం అనుకుంటాం కాని ఆ భగవంతుడే మన చేత చేయిస్తున్నాడని గాని, ఆయన చేతిలో మనం పరికరాలుగా వాడుకోబడుతున్నాం అని కాని అనుకోం. ఈ విషయాన్ని నమ్మి దాన్ని అలా స్థిరంగా, పరిపూర్ణంగా, అఖండంగా అనుకున్న రోజు జడ భరతుడికి పట్టిన గతి మనకెవ్వరికీ రాదు. ఈ సాధన ముక్తికి దగ్గర దారి."

## 29. కర్మ పని తీరు

ఓ గురువు తన శిష్యుడికి కర్మ సిద్ధాంతం గురించి బోధించాడు. శిష్యుడి అనుమానాలు తీరి, అది అతనికి చక్కగా అర్థమయ్యేందుకు అతనికి ఓ స్పర్శవేదిని ఇచ్చి చెప్పాడు.

"దీన్ని ఇనుప వస్తువులకి తాకిస్తే వెంటనే ఆ ఇనుము బంగారంగా మారుతుంది. మన మఠం వీధి చివరి ఇంట్లోని దరిద్రుడికి దీన్ని ఇచ్చినా వాడు పూర్వ జన్మ కర్మ ఫలితం ప్రకారం ఈ జన్మలో ఐశ్వర్యాన్ని అనుభవించలేకపోవడం నువ్వు గమనించవచ్చు. అప్పుడు కర్మ ఎలా పని చేస్తుందో నీకు అర్థం అవుతుంది. వెళ్ళు. ఓ వారం పాటు దీన్ని వాడి ఆధీనంలో వుంచిరా."

శిష్యుడు దాన్ని తీసుకెళ్ళి ఆ దరిద్రుడికి ఇచ్చి చెప్పాడు.

"దీన్ని ఇనుముకి తాకిస్తే అది బంగారం అవుతుంది. పై గురువారం దాకా దీన్ని నీ దగ్గర వుంచుకో. మళ్ళీ గురువారం సరిగ్గా ఈ సమయానికి వచ్చి దీన్ని నేను తీసుకెళ్తాను."

ఆ దరిద్రుడు తన ఇంట్లోని ఇనప మేకుకి దాన్ని తాకించాలనుకున్నాడు. కాని అతని భార్య చెప్పింది.

"ఈ చిన్న చిన్న వస్తువులని బంగారంగా మారుస్తే ఏం వస్తుంది? ఏదైనా పెద్ద ఇనప స్థంభాన్ని కొనుక్కురండి. మన దరిద్రం తీరుతుంది."

వెంటనే అతను తన కొడుకుతో కలిసి ఇనప వర్తకుడి దగ్గరకి వెళ్ళాడు.

"కిలో ఇనుము ఎంత?" అడిగాడు.

"ఇరవై రూపాయలు." బేరం అడాడు ఆ దరిద్రుడు.

"శనివారం ఎవరూ ఇనుముని కొనరు కాబట్టి ఆ రోజు వస్తే ధర తగ్గుతుంది." చెప్పాడు వర్తకుడు.

"ఆ పని చేద్దాం నాన్నా. ఎందుకు డబ్బు వృధా చేయడం?" కొడుకు సూచించాడు.

ఇంటికి వెళ్ళాక భార్యతో ఈ సంగతి చెప్తే కొడుకు సలహాకి సంతోషించింది. శనివారం వెళ్తే సరుకు లేదు. బుధవారం వస్తుందని చెప్పాడు ఆ వర్తకుడు. బుధవారం వెళ్తే వర్తకుడి కొడుకు వున్నాడు. బేరం ఆడాలంటే మర్నాడు ఉదయం రమ్మని, తన తండ్రి అప్పుడు ఉంటాడని చెప్పాడు వాడు. గురువారం ఉదయం దరిద్రుడు ఇనప దుకాణానికి వెళ్ళి ఎంతసేపు వేచివున్నా వ్యాపారస్థుడు రాలేదు. సమయం అవడంతో శిష్యుడు వచ్చి స్పర్శవేదిని తీసుకుని అడిగాడు.

"ఎంత బంగారం సాధించావు?"

జరిగింది దరిద్రుడు చెప్తే శిష్యుడికి గురువు బోధించిన కర్మ పని చేసే తీరు అర్ధమైంది.

## 30. వాసన

ఇద్దరు కాలేజి విద్యార్థులు కాలేజీ మెట్ల మీద కూర్చుని తమ ఫ్రండ్స్ ముందు తమ క్లాసులోని అమ్మాయిల గురించి మాట్లాడుకుంటున్నారు. వారు తమ కళ్ళతో చూడకపోయినా ఆ ఆడవారు ఇతరులతో అక్రమ సంబంధం కలిగి వున్నారని మాట్లాడుకుంటున్నారు. నిజానికి అది వారి సృష్టి తప్ప అందులో నిజం లేదని వాళ్ళకి తెలుసు. కేవలం ఆ విషయాలు తమ మిత్రుల చెవుల్లో పడాలనే తలంపుతోనే వాళ్ళు అలా మాట్లాడుకుంటున్నారు.